

స్టేషనుకు వచ్చేటప్పటికి కలకత్తా మెయిలు బయలుదేరటానికి సిద్ధంగా వుంది. వర్షం ఉధృతంగా పడుతూంది. ప్యాంటు అంచులు తడిసి గాలి వీచినపుడల్లా ఒంటికి తగిలి చిరాకు కలిగిస్తూంది. థర్డ్ క్లాసులో కాలుమోపేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. అసలు నాకు మూడవ క్లాసుకు అవినాభావ సంబంధముంది. చదువుకునే రోజుల్లో కూడా మూడో తరగతిలోనే ప్యాసయ్యేవాడిని.

బయట చీకటి చిక్కగా వుంది, కిటికీ లోంచి చలి చలిగా గాలి వీస్తోంది. ఇలాటి సమయంలో వెచ్చగా సిగరెట్టు తాగుతూ గదిలో కూర్చుని రావు, శేఖరంలతో పేకాటాడుతూంటే...అబ్బ! ఎంత మజాగా వుంటుంది! నిద్ర లేనందువల్ల కళ్ళు మండుతున్నాయి. అయినా ఈ వెధవబండి ఇలా నడిరాత్రిన రావటమేమిటి? అంత కిక్కిరిసివున్నా ప్రజలు నిల్చుని, కూర్చుని వంగొని నిద్రపోతున్నారు. నన్ను చూసి కిటికీ పక్కనున్న ఓ ఆసామి జాలి చూపించాడు. కొంచెం జరిగి నన్ను కూర్చోమన్నాడు. ఇలా చాలా చాలవ జాగాలో కూర్చోవటంకన్న నిల్చోవటమే ఎంతో హాయి. కాని పెద్దమనిషి చోటు చూపిస్తూంటే ఎలా తిరస్కరించటం? పైగా అంత దూరం ఎలా నిల్చుని ప్రయాణం చెయ్యగలము?

ఆసామిని పరకాయించి చూసాను. భారీ శరీరం. గుప్పు గుప్పుమని పొగ వదుల్తున్నాడు. వెళ్ళి కూర్చున్నాను.

'ఎక్కడదాకండీ?' నోట్లోంచి వస్తున్న చుట్ట వాసన అసహ్యంగా కొట్టింది.

'కాకినాడ'. మొహం అటు వైపు తిప్పి అన్నాను.

'మరి మీరు?' మర్యాదకోసం అడగక తప్పలేదు.

'ఏలూరుదాకండి. కాకినాడ మీ స్వంత వూరా?' కిటికీతెరిచి కాండ్రించి వుమ్మేస్తూ అడిగాడు.

కిటికీ తెరవంగానే జల్లు ఒక్కసారి మొహానికి కొట్టింది. బండి కీచుమని అరచి ఉస్సూరుమంటూ బయలుదేరింది.

కంపార్టుమెంటులోని దీపంవెలగనా ఆరనా అన్నట్టుంది. ఊరి దీపాలు క్రమంగా దూరమవుతున్నాయి.

'ఏ వూర్లో ఉద్యోగం చేస్తే ఆ వూరే స్వంత ఊరు.'

'మరేం' గట్టిగా నవ్వాడతను. ఆ నవ్వు శబ్దానికి పైన పడుకున్న మనిషి కిందకు మా వైపు చూచి మొహం చిట్లించి అటువైపు తిరిగి పడుకున్నాడు.

'మద్రాసు పోయేసొస్తున్నా. రేసుల్లో నాలుగేలు తగలడిందనుకోండి. మొన్న ఇట్టాగా హైదరాబాదు రేసుల్లో...'

ఈ సొదంతా నాకెందుకు? మనసులో విసుక్కున్నాను. డబ్బులున్నవాడిలా వున్నాడు. అందుకే రేసులు, వేలు అంటున్నాడు. నేనింకా డబ్బులో చిన్నవాడిని. పేకాటలోనే వున్నాను. చెయ్యి తిరగలేదు. లేకపోతే ఆ రావుగాడు కాదు వాడి తాతను కూడ కొట్టేయగలను.

'కాకినాడలో వీరభద్రం తెల్సా?'

నేనేం మాట్లాడలేదు. నే నెలాటివాణ్ణో నాకే తెలియదింకా.

'వాడు నా బావమరిదిలే. వాడూ, నేను కల్సిపోదామనుకున్నాము కాని మధ్యలో ఆగిపోయాడు.' ఎంతసేపటికీ నేనేం మాట్లా

ఆకపోవటం చూచి పూరుకున్నాడు.

నేనిలా బెల్లం కొట్టిన రాయిలావున్నా కాని వాటెన్ని కష్టసుఖాలు.

పెద్ద పిల్లకు పెండ్లి చెయ్యాలి. పెద్ద వాడిని కాలేజీలో చేర్చాలి. ఇవన్నీ నెరవేరా లంటే రావుగాడిని పేకాటలో గెల్పించాలి.

పక్కనున్న ఆసామి గుర్రుపెడుతున్నాడు. తలచుకున్నప్పుడు నిద్రరావటమనేది అదృష్ట వంతుల సొత్తు.

మళ్ళీ ఇంటిపైకి ధ్యాస మళ్ళింది:

'సీతకు పెండ్లిచేయండి' లక్ష్మి రోజూ పోరుతుంది. 'మీరు వెధవ పేకాటల్లో తగ లేసింది ఓ పదివేలయినా వుండుంటుంది. అదిగాని చేర్చుంటే ఈపాటికి పిల్లపెండ్లి చేసేవాళ్ళం' పిచ్చిమొహం. దానికేం తెలుసు ఆటలోని మజా. అదీ ఒక వ్యాపారమేకదా.' లాభం నష్టం.

దానిపోరుమీద వాళ్ళన్నయ్యను అడిగాను. ఈ కాలం అన్నిటికీ కరువే. ఆడపిల్లలకు మొగపిల్లలు కరువు. మొగపిల్లలకు ఉద్యో గాలు కరువు. కరువులేని దొక్కదానికే.

కరువుకు మనదేశంలో కరువులేదు.

అలా ఆలోచిస్తూ ఎంతసేపున్నానో తెలియదు.

తెలతెలవారుతూంది. వర్షం పడడం లేదు. నిద్రలేచిన వాళ్ళు లేవని వాళ్ళ కాళ్ళని తొక్కుకుంటూ వెడుతున్నారు.

కిటికీ తెరిచాను. ఏదో స్టేషను వస్తు న్నట్టుంది. పట్టాలసంఖ్య ఎక్కువయింది.

పవరుపేట స్టేషనులోంచి ఘోరంగా అరుస్తూ ముందుకు పరిగెడుతూంది బండి. వచ్చేస్టేషన్ ఏలూరు. పక్క వాయన్ను లేపాను.

మా ఇల్లు పవరుపేట దగ్గరే. ఇదేమో ఏలూరులో ఆగుద్ది. ఒళ్ళు విరుచుకుంటూ అన్నాడాసామి. నిల్చుని సూట్కేసు సర్దుకుంటున్నాడు. నల్లటి పర్సు తెల్లటి లాల్చీనుంచి కిందపడింది. అది గమనించ లేదతను పర్సువేపు చూసాను. రంగురంగుల నోట్లు.

అవన్నీ నాకిచ్చేస్తే...పోని ఒక్క నోటిస్తే!

ఎందుకు ఒకటయినా ఇవ్వటం? పిచ్చా, వెర్రా?

పోనీ నేనే ఒకటి తీసుకుంటే. మనసులో ఒక భయంకరమైన ఆలోచన వచ్చింది.

"ఫర్వాలేదు. ఒక్క నోటేగా. పైగా డబ్బున్నవాడిలా వున్నాడు. పేకాటలో ఈ నోటుతో లక్షలు కొట్టేయగలనేమో' మనసు ఉద్బోధించింది. మనసుకే ఎప్పుడూ విజయం.

మెల్లగా చెయిపోచి ఒక కాయితం లాగే సాను. జేబులో కుక్కేసాను. గుండె హౌరా మెయిలుకంటె ఎక్కువ వేగంతో కొట్టు కుంటూంది.

'పర్సు ఇదిగోండి' అందించాను పర్సును. తీసి జేబులో పెట్టుకున్నాడు. అమ్మయ్య గమనించలేదు.

పెద్ద చప్పుడుచేస్తూ మెయిలు ఏలూ రులో ఆగింది. అతడు సూట్కేసు తీసు కొని కిందకు దిగాడు. ప్లాట్ఫారం తడితో చితచితగావుంది. పట్టాలు కడిగిన ముత్యాల్లా మెరుస్తున్నాయి.

నా చాకచక్యాన్ని ఎంతగానో పొగుడు కున్నాను.

ఆ ఆసామి వెనక్కు పరిగెత్తుకొచ్చాడు. గుండె ఒక్కక్షణం కొట్టుకోవడం మానే సింది. ఇంకేముంది గమనించేసాడు. పోలీ సులకు పట్టిస్తాడా? అందరూ కలిపి నన్ను చితక పొడుస్తారా?

తిన్నగా నాదగ్గరకే పరిగెత్తుకొచ్చాడు.

'నామర చెంబుండిపోయింది. అందిం చండి' అన్నాడు.

అమ్మయ్య ఇంతేకదా అందించాను. తీసుకొని జనంలో కలిసిపోయాడు.

బండి ఏలూరు వదిలింది. పిల్లలు కొందరు ప్రయాణీకులవైపు చూస్తు చేతులూపుతూంటే, మరికొందరు ఏదో అరుస్తున్నారు.

రాత్రంతా సరిగా నిద్రలేక పోవటంతో అలానే సీటుకు జారగిలబడి నిద్రపోయాను.

మెలకువ వచ్చేసరికి రాజమండ్రి చేరింది.

అక్కడ వర్షం లేదులా వుంది. అంతా పొడి పొడిగావుంది.

ఒకవేపు అతివృష్టి ఇంకోపక్క అనా వృష్టి.

ఒకవంక కలిమి. ఒకదిక్కున లేమి.

రాత్రెప్పుడో తిన్నభోజనం కడుపు కరకర మంటూంది. కాఫీ టిఫిన్ తీసుకున్నాను.

రాత్రి జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది.

— 'సీత పెళ్ళీడుకు వచ్చింది బావగారూ' భోజనమయ్యాక తనే ప్రస్తావించాడు.

'మంచి సంబంధం చూడండన్నయ్య గారూ' ఎక్కడినుంచి ఊడిపడిందో ఆయన సతీమణి. ఉలిక్కిపడ్డాను.

'సీతను ప్రసాదరావు కిద్దామని చిన్న ప్పుడు అనుకున్నదే కదమ్మా' ఎలాగైనా ఆడపిల్లను కన్నతండ్రిని.

'వాడికొకరు పదిహేనువేలు ఇస్తామంటే మరొకరు ఇరవైవేలు ఇస్తామంటున్నారు, అన్నయ్యగారూ!'

నెల జీతంతోనే డింకీలుకొట్టే నేను ఇంతెలా ఇచ్చుకోను?

'మరి ఇన్నాళ్ళవుండి ఇప్పుడలా అంటే ఎలా చెప్పండి?'

'నేను సీతను వద్దనలేదే. ఏదో పది వేలయినా లేకపోతే ఎలాగా. ఎంతయినా సీత మనింటి పిల్ల'

ఎంత వంగపొచితపంగా మాట్లాడు తున్నది. ఇదేమైనా వంకాయల బేరమా? బావగారి వైపు చూసాను.

'ఈ విషయమంతా దానికే వదిలేసాను' చుట్ట కొడిగొట్టుకుపోతే దులుపుతూ అన్నాడు.

ఓసి వాజమ్మా! నువ్వు పెళ్ళాంచేతిలో కీలుబొమ్మ. నీకు నోరులేదూ. మనసులో అనుకున్నాను.

'మరి వస్తాను. పొద్దుటకంతా కాకి నాడ చేరాలి. మీ చెల్లెలుకూడా కాచుకొని వుంటుంది' ఆ రాత్రికి వుండమని ఎంత బలవంతపెట్టినా వుండలేక పోయాను.

సామర్లకోట బండి చేరేటప్పటికి కాకి నాడ డూప్లికేటు సిద్ధంగా వుంది.

ఇంటి కొచ్చేసరికి లక్ష్మి నా రాకకోసమే ఎదురు చూస్తూంది.

భోజనంచేసి కుర్చీ మంచంలో కూర్చున్నాను. లక్ష్మి చేతులు తుడుచు కొని నాదగ్గర కొచ్చింది.

నేనేం చెప్తానోనని పక్కగదిలో సీత దొంగచాటుగా తిరుగుతుందని గమనించక పోలేదు.

పాపం పిచ్చిపిల్ల. చాన విన్నా చేసుకో దమ్మా అని చెప్పటమా.

'వెళ్ళినపని ఏమయిందండి? అన్న య్యేమన్నాడు?' లక్ష్మివచ్చి కూర్చుంటూ అడిగింది.

— 'మీ అన్నయ్యేమంటాడులే. అంతా మీ

వదినే అంది.'

'ఏమందేమిటి ?'

'ఏమంటుంది. పనివేమయినా ఇవ్వండి. లేకపోతే ఆసంబంధం అయినా మానుకోండి అంది'

'అన్నయ్యేమనలేదూ ?' లక్ష్మి ఆదుర్దాగా అడిగింది.

లక్ష్మి ఆమాయకత్వానికి జాలివేసింది. డబ్బుగలవాళ్ళలో నూటికి తొంబయిమంది ఖర్చుచేయలేని డబ్బుబొమ్మలు.

'ఏమంటాడు. తందానాతానా అంటూ ఉన్నిటికీ.'

ఎదురు దగ్గర సందులోనుంచి చూస్తున్న సీత అక్కడ మరి కనిపించలేదు.

కొంచెంసేపు మౌనం రాజ్యం ఏలింది. నేను తెచ్చిన నోటు జ్ఞాపకం వచ్చింది. ఇంతవరకూ తీసి చూడనేలేదు.

'నా కళ్ళజోడు తెస్తా. బయటకు వెళ్ళొస్తా' అన్నా లేస్తూ.

'ఇప్పుడే వచ్చావు. మళ్ళీ ఎక్కడికి? ఆ వెధవ పేకాటేనా ఇప్పటికి తెచ్చినవేం తగలెయ్యాలా? దానిబదులు నాలుగు బంగారు గాజులు కొనరాదూ'

'సీతకు కొను లే' అనగానే అక్కడ మొహం మాడ్చి వెళ్ళిపోయింది.

# లాటరీ వేసిన లాటరీ

పార్కులో ఎక్కువమంది లేరు. ఎవరూ లేని చోటుగా కూర్చున్నాను. జేబులోంచి నోటు తీసాను.

ఎంత మోసం. దగా. అది వందనోటు కాదు. కనీసం పదీ కాదు. చివరకు ఒక రూపాయిదీ కాదు.

ఎందుకూ పనికిరాని టికట్టు. లాటరీ టికట్టు. వుండ చుట్టి దూరంగా విసిరి కొట్టాను. మనసంతా చెప్పలేని అసంతృప్తితో నిండిపోయింది.

ఒకవేళ ఆ టికట్టే అదృష్టను తెప్పిస్తే మనసెప్పుడూ లేనిపోని ఆశలు రేపుతుంది.

తీసి చూసాను. నెంబరు నాలుగు నాలుగులు. తమాషాగా వుంది. జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకున్నాను.

ఇంటికి నిరాశగా తిరిగివచ్చాను.

రోజులు యధావిధిగా గడిచిపోతున్నాయి.

ఆ రోజు మామూలుగా పేపరు తిరగేస్తున్న నాకు ఓ లాటరీ ఫలితాలు కన్పించింది. చూశాను. మద్రాసు లాటరీ ఫలితాలు. గబ గబ నెంబర్లు చూసాను.

గబగబ నా టిక్కట్టుతీసి ఏ సీరియల్‌కు చెందినదో చూసాను. సందేహం లేదు. నాకు వచ్చేసింది. లక్ష. 'నేను లక్షాధికారిని.

పోయావురోయ్' ఆనందం పట్టలేక అరిచాను. ఎవరూ నా దరిదాపుల్లో లేరు. నిజంగా ఎంత అదృష్టవంతుణ్ణి.

'నువ్వా, లేక ఆ అనామా?' ఆత్మ ప్రశ్నించింది.

'పోని అదృష్టజాతకుడిని' మనసు సమర్థించింది.

'లక్ష్మీ' గట్టిగా అరిచాను. జవాబు లేదు.

ఇంకోసారి పిలవబోయి ఆ ప్రయత్నం మానుకున్నాను. ఎందుకిప్పుడే చెప్పడం మద్రాసువెళ్ళి డబ్బుతీసుకొని, పెళ్ళికి ముహూర్తం అదీ స్థిరంచేసి అప్పుడు చెప్తాను.

నాకు ఇంట్లో కాలు నిలవటంలేదు.

'ఒసేయ్!'

'ఏం మునిగింది? అట్లా గావు కేకలు పెడతారు?' లోపలనుంచి వచ్చింది.

ఇంకేముందే, మన ఇల్లే డబ్బులో మునిగిపోతూంది అనుకొని మనసులో 'నేను మద్రాసుపోవాలి అర్జంటు' అన్నాను.

'అంత రాజకార్యం ఏంవచ్చింది?'

అన్నిటికీ వెధవ ప్రశ్నలు 'వెళ్ళాలి ఆఫీసు పనిమీద ఊ...బట్టలు సర్దు. ఈలోపల అలా పోయివస్తా' రావుగారిదగ్గర అప్పటికప్పుడు యాభై రూపాయలు అప్పు తెచ్చాను.

రైల్లో కూర్చున్నాను. మనసు ఊహా లోకాల్లో విహరిస్తుంది.


వెధవ థర్డుక్లాసు. ఎప్పుడూ దోపిడీ. గుద్దులాట. వచ్చేటప్పుడు ఫస్టుక్లాసులో రావాలి. అయినా ఎంత ఖరీదయిన హిమాన్నాతో ఏమిటి ఏం కథ

ఇంత సంతోష సమయంలో సంగిగా కూర్చోవటం నాకు నచ్చలేదు. నాకు లక్ష వచ్చిన సంగతి ఎవరికైనా చెప్పాలి.

పక్కనెవరో బట్టతలాయనకూర్చునున్నాడు. టెర్లిన్ప్యాంటు తెల్లషర్టు వేసాడు. రైలు ప్రయాణానికి ఇవేం దుస్తులు? నాలాగ కాకిప్యాంటు వేయాలికాని.

'ఎక్కడ దాకండీ' అడిగాను.

'ఒంగోలుదాకా నండీ' నా ప్రశ్నకోసమే కాచుకున్నట్లు టక్కున జవాబు ఇచ్చాడు. నా చేతిలోవున్న పత్రిక చనువుగా తీసుకొని తిరగేయసాగాడు. నా లాటరీ విషయం ఎలా చెప్పాలో తెలీకుండావున్న నాకు ఓ ఆలో



తన తట్టింది.

'ఎక్కడ చూచినా కుటుంబ నియంత్రణ చిన్నపిల్లలమొదలు తాతలవరకు ఈ విషయాలు తెలిసిపోయాయి'

'అవునవును అయినా మనుషులో మార్పురావాలండీ, సంతానం తగ్గించుకోవాలి......'

మరీ దూరంగా పోతున్నాడు ఆసామి.

'అసలు పెండ్లిండ్లే కావటం లేదు. ఇక ఈ కుటుంబ నియంత్రణ ఏమిటండీ' గట్టిగా నవ్వాను.

'మీరు చెప్పిందీ నిజమే ఎక్కడచూసినా కట్నాలదగ్గరపేచీ' దొరికిపోయాడు.

'నేను మా అమ్మాయికి ముప్ఫయివేలు ఇస్తున్నానండీ, ఎక్కువచెప్పి నా హోదాని గొప్పతనాన్ని పొగుడుకోవాలను కున్నాను.

'ముప్ఫయివేలా!' నోరు తెరిచాడాయన.

'ఆఁ నాకు లాటరీలో లక్షరూపాయలు వచ్చిందండి' అది తీసుకోవాటానికే ఇప్పుడు వెళ్లటం. అయినా ఏదో లక్షలు కొనాలని కొనలేదు. ఎవడో ఎవరోయిమ్మా అంటగట్టాడు' సాధ్యమైనంత నిర్లక్ష్యంగా అనటానికి ప్రయత్నించాను.

'లక్ష' అనంగానే అందరూ తల మొహాలు తిప్పారు. అందరూ అలా చూస్తూంటే ఎంత గర్వంగా వుందని.

'నెంబరెంతండీ?' ఎవరో అడిగారు

'తమాషా నెంబరులెండి. నాలుగు నాలుగులు'

'ఏం చేద్దామనుకుంటున్నారండీ' పక్కనున్న బట్టతలాయన అడిగాడు.

'బిజినెస్ చేస్తానండీ. కూతురి పెళ్లి అయాక'

కాబోతున్న లక్షాధికారని తెలియంగానే కొంచెం చోటుకూడా ఎక్కువ దొరికింది.

మాటలమధ్యలో బట్టతలాయన పేరు రాజశేఖరరావుగారని ఇరుమంది ఆడపిల్లల తండ్రని తెలిసింది. జాలిపడ్డాను. అప్పుడే పెళ్లికెదిగిన శశిరేఖ అనే అమ్మాయుందని కూడా తెలిసింది.

'మీరుకూడా ఒక లాటరీ టికెట్టు కొనండి' ఉచిత సలహా పారేశాను.

రుమాలులో దాచిన టిక్కెట్టును అందరికీ గర్వంగా చూపించాను. ఆ రాత్రి రైల్లో సరిగా నిద్రపట్టలేదు. అతి సుఖమైనా కష్టమైనా కల్గినప్పుడు నిద్ర రాదని అప్పుడు తెలిసింది నాకు

ఏ రెండు గంటల ప్రాంతానికో నిద్ర పట్టింది.

తెల తెలవారుతూండగా రైలు మద్రాసు చేరింది.

టాక్సీ ఎక్కి ఒక పెద్ద హోటలుకు పొమ్మన్నాను. మీటరు పది రూపాయలు చూపించేదాక తిరిగి ఒక హోటలుముందు ఆగాడు.

పది రూపాయలు ఇవ్వటానికి కష్టం వేసింది కాని లక్షరూపాయలు వస్తుందన్న సంతోషంలో ఈ బాధ కొట్టుకుపోయింది. నిజంగా అంత అందమైన హోటల్ని చూడటం అదే మొదటిసారి. స్ప్రింగు మంచాలు, డన్‌లప్ పరుపులు. భోజనం చేయగానే ఎక్కడలేని నిద్ర ముంచుకొచ్చింది.

లేచేసరికి గంట రెండు చూపుతూంది. మొహం కడుగుకొని ఆఫీసు వైపుకు వెళ్లాను రుమాలుతడిమి చూసుకున్నాను. బంధంగానే వుంది.

## రచయిత(త్రు)లకి మనవి

'కొందరు పాఠకులు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో పడే రచనలు చేసినవారి చిరునామా కోసం రాస్తూ ఉంటారు. ఈ సమాచారం రచయిత(త్రు)ల అనుమతి లేనిదే తెలుపటం వీలుకాదు. కాబట్టి తమ చిరునామా ప్రచురణకి అభ్యంతరంలేని రచయిత(త్రు)లందరూ తమ వ్రాత ప్రతుల మీద ఆ విధంగా పేర్కొంటే బాగుంటుంది. (సం)

పయి ప్రకటన దృష్ట్యా ఎటి పరిస్థితులలోనూ రచయిత(త్రు)ల చిరునామాకోరే ఉత్తరాలకి సమాధానం ఇవ్వటం జరగదు. సం.

'అక్కడ జనం ఇసుకవేస్తే రాలనట్లున్నారు. డబ్బు తీసుకొనేవాడు ఒకడైతే వాడిచుట్టూ వందమంది మనుష్యులు.

'నా టికెట్టుకు ఫస్టు ప్రైజు వచ్చింది' లోపలికివెళ్లి సంతోషంతో అరిచాను

విచిత్రంగా చూశాడు వాడు నా వైపు. 'నెంబరెంత?'

'నాలుగు నాలుగులు' గర్వంగా అన్నాను.

'నాలుగు నాలుగులా! ఇప్పుడే మీతాలూకు వాళ్లు తీసుకెళ్లారు'

మావాళ్లా? టికెట్టు నాదగ్గరుంటే 'రుమాలు తీశాను రుమాలులో టికెట్టు స్థానే ఒక తెల్లకాయితం వుంది. ఏడుపొచ్చినంత పనయింది. నా అవస్థ గమనించినట్లున్నాడు.

'ఎవరో పెద్ద మనిషిలాగే వున్నారు సార్. పోలీసు రిపోర్టివ్వండి' అంటూనే సానుభూతి చూపిస్తున్నారు కొందరు తమ అనుభవాలు చెప్పేస్తున్నారు

పోలీసు రిపోర్టిస్తే అదో దండగ అవుతుంది తీగలాగితే డొంకంతా కదిలినట్టు ఆఖరికి నా విషయం కూడా బయట పడుతుంది నేను నిజంగా కొనుంటే టిక్కెట్టెలా పోయుండేనా? ఒకవేళ పోయినా రిపోర్టు ఇవ్వటానికి ఇలా సంశయించేవాడినా? దొంగసొమ్ము. పరులసొమ్ము. లక్షాదిమంది నాచుట్టూచేరి నవ్వుతున్నట్టనిపించింది. అదృష్టం వచ్చినట్లే వచ్చి ఎలా చేజారిపోయింది! అదృష్టానికైనా అదృష్టముండాలి. చాలీచాలని డబ్బుతో ఇంటికి చేరేసరికి తాతలు దిగొచ్చారు.

తర్వాత పదిరోజులకో శుభలేఖ వచ్చింది. ప్రసాదరావు పెండ్లి నిశ్చయమయ్యుంటుంది. నే వూహించినది నిజమే. అంత కట్నం నేనివ్వలేనని తెలిసి ఇంకో సంబంధం చూసుకున్నట్లుంది. వధువెవరా అని చూశాను. 'రాజశేఖరరావుగారి ద్వితీయ పుత్రిక చి॥ సౌ॥ శశిరేఖనిచ్చి...' ఇక ఆపైన చదవలేకపోయాను వీడే నా టిక్కెట్టు కొట్టేసినవాడయ్యుంటాడు. అలాగే నిలవలేక నేలపైన చతికిలబడ్డాను.

టికెట్టుకొన్నది ఒకరు.

దానిని చేజిక్కించుకొన్నది మరొకరు.

డబ్బు కొట్టేసింది ఇంకొకరు

లాటరీ టికెట్టు వేసిన లాటరీలో నాకు ఏ ప్రైజూ రాకుండా పోయింది.